క్లుప్తంగా

వైభవంగా గీతా జయంతి



శ్రీకృష్ణుడి చిత్రపటం వద్ద హారతి ఇస్తున్న మహిళలు

మిడుతూరు: స్థానిక శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో కొలువైన శ్రీ వేణుగోపాలస్వామి, పర్వతవర్ధిని రామేశ్వరస్వామి ఆలయంలో బుధవారం గీతా జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గీతా పారాయణం, కృష్ణార్జునుల పాలరాతి విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేపట్టారు. ఉదయం శ్రీకృష్ణునికి అభిషేకం, కుంకుమార్చన, పుష్పార్చన, తదితర విశేష పూజలను వేదపండితులు సుబ్రహ్మణ్యం శర్మ శాస్త్రోక్తంగా జరిపించారు. అదేవిధంగా భజన బృందం సభ్యులు భక్తి గీతాలు ఆలపిస్తూ భజనలు చేశారు.

సేంద్రియ వ్యవసాయం లాభదాయకం



రైతులకు సూచనలు చేస్తున్న ఏఓ ఫణీశ్వరరెడ్డి

పాములపాడు: రైతులకు సేంద్రియ వ్యవసాయం లాభదాయకమని మండల వ్యవసాయాధికారి ఫణీశ్వరరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ఇస్కాల, జూటూరు గ్రామాల్లో ×పాలం పిలుస్తోంది≠ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు పంటలను పరిశీలించారు. ఖరీఫ్‌లో మినుము, కంది పంటలు ఎక్కువగా సాగు చేశారన్నారు. ఆ పంటల్లో ఆశించే తెగుళ్లు, పురుగుల గురించి వివరిస్తూ నివారణకు సలహాలు ఇచ్చారు. ప్రతి రైతు తప్పనిసరిగా క్రాప్ ఇన్సూరెన్స్ చేయించుకోవాలని సూచించారు. సర్పంచ్ మౌలాలి, రైతులు పాల్గొన్నారు.

సాక్షి గణపతికి విశేషపూజలు



సాక్షిగణపతి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో లోకకల్యాణార్థమై బుధవారం సాయంత్రం సాక్షి గణపతికి అభిషేకం, ఆలయ ప్రాంగణంలోని జ్వాలా వీరభద్రస్వామికి విశేష పూజలు నిర్వహించారు. సాక్షి గణపతి స్వామికి పంచామృతాలతోను, ఫలోదకాలతోను, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోధకం, శుద్ధ జలంతో అభిషేకం చేసి విశేషపుష్పార్చన, నివేదన కార్యక్రమాలు చేపట్టారు. జ్వాలా వీరభద్ర స్వామివారికి అభిషేకం, విశేష పుష్పార్చన జరిపించారు.

మహానందీశుడి దంపతులకు ఏకాంతసేవ

మహానంది: స్థానిక కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వర స్వామి వార్లకు బుధవారం రాత్రి ఏకాంతసేవ పూజలు నిర్వహించారు. వేదపండితులు నాగేశ్వరశర్మ, శాంతారాంభట్, ఆంజనేయశర్మ, హనుమంతుశర్మల ఆధ్వర్యంలో యాగశాలలో గణపతిపూజ, పుణ్యాహవాచనం, అలంకార పూజల అనంతరం ఏకాంతసేవ పూజలు చేపట్టారు. భక్తులు స్వామి, అమ్మవారిని దర్శించుకున్నారు.

వరి పంటకోత ప్రయోగం



వరి దిగుబడిని పరిశీలిస్తున్న ఏఓ పవన్ కుమార్

వెలుగోడు: మండలంలోని బోయరేవుల గ్రామంలో బుధవారం ఏఓ పవన్ కుమార్ పర్యవేక్షణలో వరి పంటకోత ప్రయోగాలు నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ రైతు గౌర్ల కులాయి పొలంలో పంట కోత ప్రయోగాలు నిర్వహించగా ఎకరానికి 40 బస్తాల దిగుబడి వచ్చిందన్నారు.

గోవు మృతి.. పట్టించుకోని యజమానులు

శ్రీశైలంప్రాజెక్ట్: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో అనారోగ్యంతో ఓ గోవు మృతి చెందింది. గోవు మృతదేహాన్ని ఖననం చేసేందుకు యజమానులెవరూ ముందుకు రాలేదు. కొందరు గోవులను కొనుగోలు చేసి పాలు మాత్రమే పితుక్కొని, ఆహారానికి మాత్రం వీధుల్లోకి వదిలేస్తున్నారనే విమర్శలున్నాయి. అనారోగ్యంతో మృతి చెందిన సమయంలో ఖనన ఖర్చులు పెట్టాల్సి వస్తుందనే ఉద్దేశంతో గోవు తమది కాదని.. యాక్సిడెంట్‌లో రోడ్లపై గాయపడినా, మృతిచెందినా ఆ ఆవు తమదేనని గోలగోల చేసి డబ్బు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. పంచాయతీ అధికారులు స్పందించి గోవులను వీధుల్లోకి వదలకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

● ఐసీడీఎస్ పీడీ వి.లీలావతి



మాట్లాడుతున్న ఐసీడీసీ పీడీ లీలావతి

బండి ఆత్మకూరు: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఐసీడీఎస్ పీడీ వి.లీలావతి సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కిశోరి వికాసం శిక్షణ కార్యక్రమంలో పీడీ లీలావతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిశోర బాలికలు వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. బాగా చదువుకుని బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలన్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకు బాల్య వివాహాలు చేయకుండా ఉన్నత విద్యను అందించాలన్నారు. అనంతరం బాల్య వివాహాలను అరికడదాం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమానికి ఎంపీడీఓ దస్తగిరి, ఎంఈఓలు మోహన్‌రెడ్డి, యశోద, ఈఓఆర్డీ రామకృష్ణవేణి, హెల్త్ ఆఫీసర్ సుబ్రహ్మణ్యం, మహిళా కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్‌లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కిశోరి వికాసం.. భవిష్యత్తు కు పునాది

వెలుగోడు: కిశోరి వికాసం కార్యక్రమం కిశోర బాలిక భవిష్యత్‌కు పునాది వంటిదని ఐసీడీఎస్ పీడీ వి.లీలావతి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం కిశోరి వికాసంపై అంగన్‌వాడీ కార్యకర్తలకు, సచివాలయ ఐకేపీ ఉద్యోగులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ లీలావతి, ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డిలు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. కిశోరి వికాసం బాలికల బంగారు భవిష్యత్తుకు పునాది వేస్తుందన్నారు. ప్రతి బాలిక తన పూర్తి సామర్థ్యాన్ని తెలుసుకోగలిగేలా సమగ్ర అభివృద్ధికి చేయూతనివ్వనున్నట్లు చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో బాలికలను మధ్యలోనే బడి మాన్పించి చిన్న వయసులోనే వివాహాలు జరిపిస్తున్నారన్నారు. బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శ్రీనివాసులు, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీదేవి, వరలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు కోమల, సూర్యకుమారి, వినోలియా పాల్గొన్నారు.

రబీ ప్రీమియం రైతులే చెల్లించాలి

బండిఆత్మకూరు: రబీ ప్రీమియం రైతులే చెల్లించాలని మండల వ్యవసాయ అధికారి స్వాతి సూచించారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి పంటకు ఈనెల 30లోపు, ఆరుతడి పంటలకు ఈనెల 15వ తేదీలోపు రైతులే బీమా ప్రీమియం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో వెటర్నరీ డాక్టర్ అనూష పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుకు 15 దరఖాస్తులు

బండిఆత్మకూరు: మండల పరిధిలోని జి.లింగాపురం గ్రామంలో బుధవారం నిర్యహించిన రెవెన్యూ సదస్సులో 15 దరఖాస్తులు అందినట్లు తహసీల్దార్ పద్మావతి తెలిపారు. పొలం సర్వేకు 12, మ్యుటేషన్‌కు 3 దరఖాస్తులు అందాయన్నారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

భోజనశాల ప్రారంభం



భోజనశాలను ప్రారంభిస్తున్న రాంభూపాల్ రెడ్డి

ఆత్మకూరు రూరల్: మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలో వెలసిన మల్లేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో భక్తుల కోసం నిర్మించిన భోజనశాలను పాణ్యం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఆధ్యాత్మిక గురువులు నిత్యానంద భారతీ స్వాములు, వీరాచారి స్వాములు, శివస్వామి, నల్లగుంట్ల నారాయణ స్వామి, గ్రామపెద్దలు రమణారెడ్డి, లక్ష్మిరెడ్డి, నాగేశ్వరరెడ్డి, వెలుగోడు ఎంపీపీ లాలం రమేష్, పువ్వాడి భాస్కర్, లాలం సుధాకర్, శ్రీధర్ రెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రబీ పంటల నమోదు

మహానంది: మండలంలో గురువారం నుంచి రబీ పంటల నమోదు కార్యక్రమం చేపట్టనున్నట్లు మండల వ్యవసాయ అధికారి నాగేశ్వరరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ రబీలో పంటలు సాగు చేసిన రైతులు పొలం పట్టాదారు పాసుబుక్, ఆధార్‌కార్డు, మొబైల్ నంబర్లను సంబంధిత సిబ్బందికి అందించాలన్నారు. ఖరీఫ్‌లో పంట నమోదు చేసుకున్న అరటి, మునగ, మామిడి రైతులు ఇప్పటికే పంట నమోదు చేసుకుని ఉంటే మళ్లీ చేయించుకోవాల్సిన అవసరం లేదన్నారు.

రేపు మహానందీశుడి హుండీ కానుకల లెక్కింపు

మహానంది: ఈనెల 13న స్థానిక ఆయల హుండీ కానుకల లెక్కింపు నిర్వహించనున్నట్లు ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి, కోదండరామాలయం, వినాయకనంది, ఇతర ఆలయాలతోపాటు అన్నప్రసాద విభాగం, గో సంరక్షణ విభాగాల్లోని హుండీలో భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించనున్నట్లు తెలిపారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు సిద్ధం



చింతలపల్లి గ్రామ సచివాలయం వద్ద నోటిఫికేషన్ ప్రచురిస్తున్న మిడుతూరు ఎంపీడీఓ దశరథరామయ్య



సచివాలయం వద్ద ఎన్నికల నోటిఫికేషన్ పరిశీలిస్తున్న అధికారులు

జూపాడుబంగ్లా: ఈనెల 14న ఉదయం 10గంటలకు సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్ తెలిపారు. బుధవారం ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పోలింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని కేసీ కాల్వ ఆయకట్టు తో పాటు మండ్లెం, తంగడంచ, పారుమంచాల, వీరాపురం చెరువుల కిందున్న ఆయకట్టు రైతులతో సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు నోటిఫికేషన్ వెలువడిందన్నారు. కేసీ కాల్వ సాగునీటి సంఘాల ఎన్నికలు జూపాడుబంగ్లా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, మండ్లెం చెరువు ఎన్నికలు మండ్లెం ప్రాథమిక పాఠశాలలో, తంగడంచ చెరువు ఎన్నికలు తంగడంచ ప్రాథమికోన్నత పాఠశాలలో, పారుమంచాల చెరువు ఎన్నికలు పారుమంచాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, వీరాపురం చెరువు ఎన్నికలు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఆయకట్టు రైతులు ఓటర్ల జాబితాలో వారి పేర్లను పరిశీలించుకోవాలని సూచించారు.

పాములపాడు: మండలంలోని వేంపెంట, వాడాల, మద్దూరు, పాములపాడు సాగునీటి వినియోగదారుల సంఘాలకు ఈనెల 14వ తేదీన ఎన్నికల నిర్వహణకు ఎన్నికల అధికారులు నోటిఫికేషన్ జారీ చేసినట్లు తహసీల్దార్ సుభద్రమ్మ తెలిపారు. పాములపాడు సంఘానికి ఎన్నికల అధికారిగా ఎంపీడీఓ కార్యాలయ ఏఓ గాయిత్రీ, వేంపెంటకు వ్యవసాయ అధికారి ఫణీశ్వరరెడ్డి, మద్దూరుకు విద్యాధికారిణి సుభాషిణి దేవి, వాడాలకు తహసీల్దార్ సుభద్రమ్మ ఎన్నికల అధికారులుగా నియమించినట్లు వెల్లడించారు.

మిడుతూరు మండలంలో..

మిడుతూరు: మండల పరిధిలోని చింతలపల్లి గ్రామంలోని పోచావాగు కింద నీటి వినియోగించుకుంటున్న రైతులకు నీటి సంఘం ఎన్నికలు నిర్వహించేందుకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఎంపీడీఓ దశరథరామయ్య బుధవారం తెలిపారు. ఎంపీడీఓ మాట్లాడుతూ నీటి సంఘం ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ పత్రాలను చింతలపల్లి గ్రామ సచివాలయం, ఖాజీపేట ఎంపీపీ స్కూలు, చింతలపల్లి ప్రాథమికోన్నత పాఠశాల వద్ద నోటీసు బోర్డులో ఏర్పాటు చేశారు. రైతులు నోటీస్ బోర్డులో సరిచూసుకొని ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలపాలని సూచించారు.

మహానంది మండలంలో..

మహానంది: మండల పరిధిలోని సాగు నీటి వినియోగదారుల సంఘాలకు ఈనెల14న ఎన్నికలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ పి.రమాదేవి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తమ్మడపల్లె ఇంజవాణి చెరువు, గోపవరం బైరవాణి చెరువు, గాజులపల్లె అంకిరెడ్డి చెరువు, బసవాపురం చెరువుల నీటి వినియోగదారుల సంఘాలకు ఒక్కొక్క చెరువుకు ఆరు ప్రాదేశిక నియోజకవర్గ వర్గాల ప్రతినిధులకు, అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకు ఎన్నికలు ఉంటాయన్నారు. వీటితోపాటు తెలుగుగంగ ప్రాజెక్టుకు సంబంధించి ఎన్నికలు జరుగుతాయన్నారు.

వెలుగోడు: మండలంలోని మోత్కూరు సాగు నీటి వినియోగదారుల సంఘం ఎన్నికలు ఈనెల 14న నిర్వహించనున్నట్లు ఏఓ పవన్ కుమార్ తెలిపారు. నోటిఫికేషన్ ప్రతులను బుధవారం ఆయన సచివాలయం గోడపై ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ రైతులు తమ ఓటును వినియోగించుకోవాలన్నారు.

ఒక శాతం లేబర్ సెస్ చెల్లించాలి

● జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్



మాట్లాడుతున్న జేసీ విష్ణుచరణ్

నంద్యాల: అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో జరుగుతున్న నిర్మాణ పనులకు చెందిన కాంట్రాక్టర్‌కు చెల్లించే సొమ్ములో ఒక శాతం లేబర్ సెస్ కార్మిక సంక్షేమ బోర్డుకు చెల్లించాలని జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో లేబర్ సెస్ కార్మిక సంక్షేమ బోర్డుకు చెల్లించే అంశంపై సంబంధిత అధికారులతో జేసీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్‌విష్ణు చరణ్ మాట్లాడుతూ అన్ని శాఖలతో సమన్వయంతో ఎప్పటికప్పుడు సమాచారాన్ని తెప్పించుకుని డేటా బేస్ ఏర్పాటు చేసుకోవాలని కార్మిక శాఖ అధికారులను ఆదేశించారు. ప్రతి నిర్మాణ సంస్థ చట్టాన్ని అనుసరించి విధిగా మీసేవలోగాని, ఆన్‌లైన్ ద్వారా కానీ రిజిస్ట్రేషన్ చేయాలన్నారు. ప్రభుత్వ నిర్మాణ పనులు అమలు చేసే ప్రభుత్వ శాఖల అధికారులు, బిల్డింగ్ ప్లానులు అప్రూవల్ చేసే సంస్థలైన మున్సిపల్ కార్పొరేషన్, పంచాయతీరాజ్, ఏపీఐఐసీలకు చెందిన సంస్థలు ఒక శాతం లేబర్ సెస్ కార్మిక సంక్షేమ బోర్డుకు చెల్లించే అంశంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. సమావేశంలో కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ బాలునాయక్, ఉప కమిషనర్ వెంకటేశ్వర్లు, సహాయ కార్మిక కమిషనరు బషీరున్నిసా బేగం, ఆర్అండ్ బి ఎస్ఈ శ్రీధర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి, ఇరిగేషన్ ఎస్ఈ సుబ్బరాయుడు, జిల్లా సమన్వయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బాలికల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి

పగిడ్యాల: కిశోర బాలికల శారీరక, మానసిక ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారి మోహన్ సూచించారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఎంపీడీఓ సుమిత్రమ్మ అధ్యక్షతన కిశోరి వికాసం మండల స్థాయి శిక్షకుల శిక్షణ కార్యక్రమం చేపట్టారు. ఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లకు కిశోర బాలికల సంరక్షణపై అవగాహన కల్పించారు. కౌమార దశలో బాలికలకు పోషకాలతో కూడిన ఆహార పదార్థాలను అందించాలన్నారు. రక్తహీనత బారిన పడకుండా ఐరన్‌తో కూడిన ఆహారం ఇవ్వాలన్నారు. పిల్లల ప్రవర్తనలో మార్పులు గమనించాలని సూచించారు. కార్యక్రమంలో సీడీపీఓ కోటేశ్వరమ్మ, ఎంఈఓలు సుభాన్, మురళీ మోహన్‌రెడ్డి, ఏపీఓ చంద్రకళ, ఐసీడీఎస్ సూపర్ వైజర్ శేషమ్మ, ఏఎస్ఐ సుబ్బరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులను మోసం చేసిన కూటమి ప్రభుత్వం



పోస్టర్లను విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నందికొట్కూరు: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం రైతులను నట్టేట ముంచేసిందని వైఎస్సార్‌సీపీ నాయకులు పుల్యాల నాగిరెడ్డి, మన్సూర్, శివరామకృష్ణారెడ్డి ధ్వజమెత్తారు. బుధవారం పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 13వ తేదీన నంద్యాల జిల్లా కేంద్రంలో అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ తలపెట్టిన నిరసన కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు చలో నంద్యాల కార్యక్రమానికి నియోజకవర్గంలో పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలి రావాలన్నారు. రైతులకు తక్షణమే పెట్టుబడి సాయం రూ. 20 వేలు బ్యాంకు ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేశారు. ధాన్యానికి కనీస మద్దతు ధర కల్పించకపోవడంతో దళారీ వ్యవస్థ రైతులను తక్కువ రేటుకు కొనుగోలు చేస్తున్నా కూటమి ప్రభుత్వం నిమ్మకునిరెత్తినట్లు వ్యవహరించడం దారుణమన్నారు. గత జగనన్న పాలనలో ప్రతి ఏటా వైఎస్సార్ రైతు భరోసా, పంటలకు ఉచిత బీమా ఇస్తే, కూటమి పాలనలో రైతుపై అదనపు భారం మోపడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. అనంతరం అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ చలో నంద్యాల పోస్టర్లను నాయకులు విడుదల చేశారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అబుబక్కర్, తిరుమలేష్‌రెడ్డి, నాగిరెడ్డి, ఉపేంద్రారెడ్డి, శ్రీకాంత్, విజ్జి, నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన ఉండాలి

నంద్యాల (అర్బన్) : తమ హక్కులపై మహిళలు అవగాహన పెంచుకోవాలని నంద్యాల ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్టు సీడీపీఓ చంద్రకళ తెలిపారు. స్థానిక ఎన్‌జీవోస్ కాలనీలోని కిశోర వికాసం ట్రైనింగ్ కో-ఆపరేటివ్ సెంటర్‌లో బుధవారం కిశోరి వికాసంపై మండల స్థాయి శిక్షకుల శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పౌష్టికాహారం గురించి బాలింతలు తెలుసుకుని చిన్నారులకు పౌష్టికాహారం అందేలా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం కిశో వికాసానికి సంబంధించిన గోడ పత్రికను ఎంఈఓ బ్రహ్మం నాయక్, ఐసీడీఎస్ అధికారులతో కలిసి విడుదల చేశారు.

సోలార్ పరిశ్రమలో చోరీ

పాణ్యం: మండల పరిధిలోని పిన్నాపురం గ్రామంలో ఉన్న సోలార్ పరిశ్రమలో తీగల చోరీ జరిగింది. ఈ మేరకు కంపెనీ అధికారులు పోలీసులకు సమాచారం అందించారు. బుధవారం ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి సోలార్ పరిశ్రమలో చోరీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. అలాగే ప్రజలతో మాట్లాడారు. త్వరలో దొంగలను పట్టుకుంటామని చెప్పారు. చోరీ తీగెల విలువ భారీగా ఉంటుందన్నారు.

పామాయిల్ సాగుతో రైతుల ఆర్థికాభివృద్ధి

కొత్తపల్లి: పామాయిల్ సాగుతో రైతులు ఆర్థికాభివృద్ధి చెందుతారని ఎంపీడీఓ మేరి సూచించారు. బుధవారం మండల పరిధిలోని కొక్కెరంచ గ్రామ పంచాయతీలో రైతులు సాగుచేసుకున్న పామాయిల్ తోటలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ మండలంలో పామాయిల్ సాగుపై ఆసక్తి ఉన్న రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. హార్టీకల్చర్ శాఖ ద్వారా ప్రభుత్వ సబ్సిడీ, ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా ఫిట్టింగ్, ప్లాంటింగ్, మెయింటెనెన్స్ ఖర్చులు ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఈసీ శ్రీనివాసులు, టెక్నికల్ అసిస్టెంట్ ప్రసాద్, ఫీల్డ్ అసిస్టెంట్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఈ సర్వే పూర్తి చేయండి

ఎంఎస్ఎంఈ సర్వేను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ మేరి సూచించారు. బుధవారం మండలంలోని కొక్కెరంచ గ్రామంలో జరుగుతున్న సర్వేను తనిఖీ చేశారు.

బాల్యవివాహాలు నిర్మూలించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ సుభద్రమ్మ

పాములపాడు: బాల్య వివాహాలు జరిపించినా, ప్రోత్సహించినా చట్టరీత్యా నేరమని, దీనిపై ప్రతిఒక్కరికీ అవగాహన కల్పించాలని తహసీల్దార్ సుభద్రమ్మ ఆదేశించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అడిషనల్ సీడీపీఓ మంగవల్లి అధ్యక్షతన కిశోరి బాలికా వికాసం సిబ్బందికి శిక్షణా తరగతి నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగలక్ష్మి, ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎంఈఓ బాలాజీ నాయక్, అడల్ట్ ఎడ్యుకేషన్ శ్రీనివాసులు మాట్లాడుతూ.. చిన్న వయస్సులో వివాహాలు చేయడం వల్ల శారీరకంగా ఎదుగుదల లేక బాలికలు అనారోగ్యానికి గురవ్వడం, తల్లీబిడ్డ ప్రాణానికి ముప్పు ఏర్పడుతుందన్నారు. ఆడపిల్లల పట్ల ప్రతిఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని చెప్పారు. తప్పనిసరిగా చదివించాలన్నారు. మైనర్ బాలికను వివాహం చేసుకొని సంసారం చేస్తే అత్యాచారం కేసుగా పరిగణించబడుతుందని వివరించారు. బాల్య వివాహాలపై చైల్డ్ హెల్ప్‌లైన్ – 1098, ఉమెన్ హెల్ప్‌లైన్ – 181, పోలీస్ హెల్ప్‌లైన్ – 100, భూమిక హెల్ప్‌లైన్ – 1800 425 2908 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. అధ్యాపకురాలు రత్నప్రభ, ఏపీఎం ఉమామహేశ్వరి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లలితప్రభావతి, అంగన్‌వాడీ టీచర్లు, మహిళా పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమ శాఖ అధికారిని నియమించాలి

ఆత్మకూరు: జిల్లాకు రెగ్యులర్ గిరిజన సంక్షేమశాఖ అధికారిని నియమించాలని గిరిజన ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు జవహర్‌నాయక్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గురుకుల పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయుల వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. గిరిజన ఉపాధ్యాయులు ఉద్యమబాట పట్టి నెల రోజులైనా ప్రభుత్వం స్పందించకపోవడం తగదన్నారు.

బీమా ప్రీమియం చెల్లించాలి

మిడుతూరు: రబీ సీజన్‌లో సాగు చేసిన ఉద్యాన పంటలకు రైతులు బీమా ప్రీమియం చెల్లించాలని నియోజకవర్గ ఉద్యాన శాఖ అధికారి తేజస్విని సూచించారు. బుధవారం ఆమె మాట్లాడుతూ మామిడి తోటలకు వాతావరణ ఆధారిత బీమాకు ప్రీమియం ఎకరాకు రూ.2,250 చెల్లించాలన్నారు. ఈనెల 15వ తేదీలోపు బ్యాంకులు, కామన్ సర్వీస్ సెంటర్, మీ సేవా, బీమా కంపెనీ ప్రతినిధుల వద్ద ప్రీమియం చెలించాలన్నారు.

వన్యప్రాణుల సంరక్షణకు చర్యలు తీసుకోవాలి

మహానంది: వన్యప్రాణుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అటవీశాఖ డిప్యూటీ డైరెక్టర్ అనురాగ్ మీనా తెలిపారు. మహానందిలోని పర్యావరణ కేంద్రంలో వన్యప్రాణుల సంరక్షణపై బుధవారం సమావేశం నిర్వహించారు. డిప్యూటీ డైరెక్టర్ అనురాగ్ మీనా మాట్లాడుతూ నల్లమలలో పులులతో పాటు వన్యప్రాణుల సంచారంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ వాటి సంరక్షణకు తగిన ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఎవరైనా వన్యప్రాణులను వేటాడితే చట్టపరమైన చర్యలతోపాటు వన్యప్రాణుల చట్టాల మేరకు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో హైటికాస్ సంస్థ ప్రతినిధి దూపాడు శ్రీధర్, ఫారెస్ట్ రేంజర్లు, ఎఫ్ఎస్ఓలు, ఎఫ్‌బీఓలు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల బీమా చేయించుకోండి



తంగడంచలో ఉల్లి పైరును పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ అధికారి తేజశ్విని

జూపాడుబంగ్లా: 2024–25 రబీ సీజన్‌కు ఉద్యాన పంటలుగా సాగుచేసిన ఉల్లి, మామిడి తోటలకు బీమా చేయించుకోవాలని హార్టికల్చర్ నియోజకవర్గ అధికారిణి తేజశ్విని సూచించారు. ఆమె బుధవారం మండలంలోని తంగడంచ గ్రామంలో రైతులు సాగుచేసిన ఉల్లి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉల్లి పంట సాగుచేసిన రైతులు ఎకరానికి రూ.90, మామిడి తోటల రైతులు ఎకరాకు రూ.2,250 ప్రీమియం చెల్లించి బీమా చేయించుకోవాలన్నారు. తద్వారా ప్రకృతి వైపరీత్యాలు సంభవించి పంటనష్టం వాటిల్లితే ఎకరాకు రూ.1,12,500 బీమా వర్తిస్తుందని తెలిపారు. రైతులు ఈనెల 15వ తేదీలోగా బ్యాంకులు, మీసేవా కేంద్రాలు, సీఎస్‌సీ సెంటర్లలో ప్రీమియం చెల్లించి పంటలబీమా నమోదు చేయించుకోవచ్చన్నారు.

ఉపాధి పనులు కల్పించండి

కొత్తపల్లి: మండలంలోని అన్ని గ్రామాలలో జాబు కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పించాలని ఈసీ శ్రీనివాసులు సూచించారు. బుధవారం స్థానిక కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రెండు సంవత్సరాలకు సరిపడ కొత్త పనులను గుర్తించాలన్నారు. గుర్తించిన పనులకు ఎస్టిమేషన్ వేయాలని సూచించారు. కార్యక్రమంలో ఐటీడీఏ సిబ్బంది, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ స్వరాజ్ అభియాన్‌పై శిక్షణ

జూపాడుబంగ్లా: గ్రామ స్వరాజ్ అభియాన్‌పై రెండు రోజుల పాటు అధికారులు, సర్పంచులు, కార్యదర్శులకు గురువారం నుంచి శిక్షణ ప్రారంభించనున్నట్లు ఎంపీడీఓ గోపికృష్ణ బుధవారం తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ బుధ, గురు రెండు రోజులపాటు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. కార్యక్రమానికి మండలంలోని అన్ని శాఖల మండల స్థాయి అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు శిక్షణకు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు.